15 నుంచి కేసీఆర్ పర్యటన

- ఉమ్మడి జిల్లా హుస్నాబాద్ నుంచి ప్రచారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ విడుదలవటంతో పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. సిరిసిల్ల, మంథని, పెద్దపల్లి, హుస్నాబాద్, కోరుట్ల, పెద్దపల్లి నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించేందుకు గులాబీ బాస్ సిద్ధమయ్యారు.

సభల వివరాలు

తేదీ	నియోజకవర్గం
15 అక్టోబర్	హుస్నాబాద్
17అక్టోబర్	సిరిసిల్ల
02 నవంబర్	ధర్మపురి
03 నవంబర్	కోరుట్ల
07 నవంబర్	మంథని, పెద్దపల్లి



న్యూస్‌రీల్

ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

సిరిసిల్లటౌన్: మానసిక ఒత్తిడి జయిస్తూ ఉన్నతంగా రాణించాలని జిల్లా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన మానసిక అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రొఫెసర్లు డాక్టర్ సతీశ్, సాగరిక, సైకాలజిస్టు పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



భవ్యశ్రీ శివమణి

కోనరావుపేట(వేములవాడ): ఎస్జీఎఫ్ అండర్ –17 బాలబాలికల ఖోఖో విభాగంలో కరీంనగర్ జిల్లా స్థాయిలో కోనరావుపేట మండలం ధర్మారం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ ఎస్కే మొయినొద్దీన్ తెలిపారు. ధర్మారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వై.భవ్యశ్రీ, వి.శివమణి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, ఈ నెల 13 నుంచి 15 వరకు వనపర్తి జిల్లా సోలిపూర్ గ్రామంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు మురళీనాయక్, ఎస్ఎంసీ చైర్మన్ వి.మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

కవి నరసింహాచారికి నివాళి



నివాళి అర్పిస్తున్న కవులు

సిరిసిల్లకల్చరల్: ఇటీవల మరణించిన జిల్లాకు చెందిన కవి ఎర్రోజు నరసింహాచారికి సిరిసిల్ల సాహితీ సమితి మంగళవారం ఘనంగా నివాళి అర్పించింది. బాలల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించేలా కవిత్వాన్ని వెలువరించిన నరసింహాచారి సాహిత్య సేవలను కొనియాడారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు రామరాజు, జూకంటి జగన్నాథం, డాక్టర్ జనపాల శంకరయ్య, కోడం నారాయణ, వెంగల లక్ష్మణ్, కళాకారుల సంఘం అధ్యక్షుడు బొడ్డు రాములు, దొంత దేవదాసు, సంగీతం సత్యనారాయణ పాల్గొన్నారు.

‘అక్రమాలు అరికట్టాలి’



మాట్లాడుతున్న వేణు

సిరిసిల్లటౌన్: జిల్లాలో రైస్‌మిల్లర్ల అక్రమాలు అరికట్టేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో మాట్లాడారు. జిల్లా నుంచి అనేక సంఖ్యల లారీల్లో పీడీఎస్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ.. అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈవిషయమై అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే పార్టీ ఆధ్వర్యంలో పెద్దెత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పంతం రవి, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’కు స్పందన

సిరిసిల్లటౌన్: జిల్లాలో ‘ఆరోగ్యమహిళ’ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన ‘ఆరోగ్య మహిళ’ శిబిరానికి మంచి స్పందన వస్తుందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ హెల్త్‌సెంటర్లలో నిర్వహించిన శిబిరాల్లో ఓపీడీ 582, బ్రెస్ట్ 578, ఓరల్ కావిటీ 580 పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ 09, ల్యాబ్ 76, థైరాయిడ్ 44, విటమిన్ డీ 41, సీబీపీ 63, సూక్ష్మ పోషకాలు 47 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో నలుగురిని జిల్లా సుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి..!

- ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల విన్నపాలు
- విజయం కోసం బండి సంజయ్, మక్కాన్ సింగ్, ఆది శ్రీనివాస్, అడ్లూరి, కేకే ఆరాటం
- బీఆర్ఎస్ నుంచి చల్మెడ, కౌశిక్, సంజయ్‌లది అదే బాట..
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర రాజకీయం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: విజయం.. వేదిక ఏదైనా బరిలో ఉన్నవారితో దోబూచులాడే అనుభూతి. ఆఖరి క్షణం వరకు పోరాటం చేసినా.. ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ. అందు కే, ఓటమిని తలచుకొని బాధ పడకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా చివరి వరకు పోరాడాలి అంటారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు నాయకులు అసెంబ్లీకి పోటీ పడుతున్న తీరు కూడా అలాగే కనిపిస్తోంది. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే ఆశావహులు తమను ఈసారైనా గెలిపించాలని.. ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ ప్రజల ముందుకు వస్తున్నారు. విపక్షాల మాటలు నమ్మితే మోసపోతారని, తమను తిరిగి గెలిపిస్తే అభివృద్ధి కొనసాగిస్తామని.. తమకు మరో అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త ఆశావహులు ప్రచారం ప్రారంభించారు.

వరుస ఓటములు.. అయినా బరిలో..

ఉమ్మడి జిల్లాలో పలువురు వరుస ఓటములు ఎదురైనా ఏమాత్రం కుంగిపోకుండా విజయం కోసం బరిలో నిలుస్తూనే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచే ఉండటం గమనార్హం.

- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆది శ్రీనివాస్(వేములవాడ), అడ్లూరి లక్ష్మణ్(ధర్మపురి), కేకే మహేందర్‌రెడ్డి(సిరిసిల్ల) నాలుగు సార్లు బీఆర్ఎస్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా, వీరంతా ఏమాత్రం వెరవకుండా ఈసారి ఎలాగైనా గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.
- కరీంనగర్ నుంచి 2014, 2018 ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్(బీజేపీ), పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్)లు రెండుసార్లు ఓడారు. అయినా మూడోసారి బరిలో దిగి, గెలుపు రుచి చూడాలనుకుంటున్నారు.
- హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి 2018లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి, ఓడిపోయారు. ఇప్పుడు అసెంబ్లీకి తిరిగి పోటీ చేస్తున్నారు.
- మానకొండూరు నుంచి 2009లో ప్రజారాజ్యం, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి రామగుండం బరిలో నిలిచిన మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కు నిరాశ ఎదురైంది. ఈసారి కర్ణాటక ఎన్నికల ప్రభావం, ప్రభుత్వ వ్యతిరేకత అనుకూలిస్తుందని విజయంపై ధీమాగా ఉన్నారు.
- కోరుట్ల నియోజకవర్గం నుంచి 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావు పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కూడా పోటీకి సిద్ధంగా ఉన్నారు.
- 2009లో పెద్దపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయరమణారావు గెలిచారు. తర్వాత 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినా విజయం వరించలేదు. ఈసారీ ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.
- 2014లో, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి పోటీ చేసిన చల్మెడ లక్ష్మీనరసింహారావు ఓడిపోయారు. ప్రస్తుతం పార్టీ మారి, బీఆర్ఎస్ అభ్యర్థిగా వేములవాడ నుంచి బరిలో నిలిచారు.
- మంథని నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పుట్ట మధు పోటీచేసి, ఓడిపోయారు. 2014లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. 2018లో పరాజయం పాలైనా.. ఈసారి విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.

అభివృద్ధిపై సిట్టింగ్‌ల హామీ

మరోవైపు ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలకు గానూ 11 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే బరిలో ఉన్నారు. వీరిలో 8 మంది సీనియర్లు కాగా.. ముగ్గురు కొత్తగా పోటీలో నిలిచారు. తమకు మరో చాన్స్ ఇస్తే.. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి/షాదీముబారక్, పింఛన్లు, గృహలక్ష్మి, బీసీబంధు తదితర సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయడంతోపాటు మరింత అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇస్తున్నారు.

- కేటీఆర్ (2009, 2010, 2014, 2018) నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో తన మార్క్ చూపించారు. సిరిసిల్ల నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ధీమాగా ఉన్నారు.
- గంగుల కమలాకర్ 2009లో టీడీపీ, 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించి, కరీంనగర్‌లో కొత్త రికార్డు సృష్టించారు. స్మార్ట్‌సిటీ, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్ వంటి రూ.వందల కోట్ల ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో మంత్రిగా నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. నాలుగోసారి విజయంపై కన్నేశారు.
- కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి వరుసగా విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ధర్మపురి నుంచే బరిలో నిలిచారు.
- 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ (మానకొండూరు), దాసరి మనోహర్‌రెడ్డి (పెద్దపల్లి), వొడితెల సతీశ్‌బాబు (హుస్నాబాద్) తాజా ఎన్నికల్లో గెలిచి, హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు.
- 2018 ఎన్నికల్లో డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), కోరుకంటి చందర్(రామగుండం), సుంకె రవిశంకర్(చొప్పదండి) గెలిచారు. రెండోసారి విజయం సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు.
- ఈటల రాజేందర్ హుజూరాబాద్ నుంచి 2004, 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచారు. అనూహ్యంగా పార్టీ మారి, 2021 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యారు.
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983 టీడీపీ నుంచి శాసనసభకు వెళ్లిన ఆయన.. 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలవనున్నారు.
- డాక్టర్ సంజయ్ కోరుట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు కొత్తగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కౌశిక్, చల్మెడ గతంలో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినవారే.
- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా గెలిచిన కోరుట్ల ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రమేశ్‌బాబు మాత్రం 2009లో టీడీపీ నుంచి గెలవగా, కోరుట్ల నుంచి విద్యాసాగర్‌రావు నాలుగుసార్లు కారు గుర్తు మీదనే గెలవడం గమనార్హం.

సమ్మె తాత్కాలిక విరమణ



సిరిసిల్లటౌన్: పక్షం రోజులు నిరవధిక సమ్మెలో ఉన్న ఆశావర్కర్లు తాత్కాలిక విరమణకు దిగారు. సోమవారం హైదరాబాద్‌లో హెల్త్ డైరెక్టర్ ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం నుంచి విధుల్లో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. ఈమేరకు సిరిసిల్లలో డెప్యూటి డీఎంహెచ్‌వోకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు మంజుల, పద్మ, మమత తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



సిరిసిల్లటౌన్: ఎన్నికల వేళ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సిరిసిల్ల నేతలను మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అభినందించారు. కొద్దికాలంగా బీఆర్ఎస్‌లో అలకబూనిన మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ యెల్లె లక్ష్మీనారాయణ, ముఖ్య నాయకులు వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్ సోమవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకోవడానికి వెళ్లడం జిల్లా రాజకీయాల్లో చర్చకు తెరలేచింది. అయితే ఢిల్లీలో పార్టీ కార్యకలాపాల్లో బిజీగా ఉన్న రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్ రావడంతో ఆయనను సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. వారిని పార్టీలో ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణగౌడ్ తదితరులున్నారు.

16 నుంచి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈనెల 16 నుంచి 26 వరకు జరగనున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పట్టణంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు నిషేధమని తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 30 నుంచి వచ్చే నెల 6 వరకు నిర్వహించబడునని పేర్కొన్నారు.

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి పక్కన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలో మోడల్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని పార్టీలు ఎన్నికల నియమావళిని అనుసరించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకోబడుతాయన్నారు. కొత్తగా ఓటరు నమోదుకు నామినేషన్ల స్వీకరణకు పదిరోజులు ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రచారాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో అనుమతులు పొందవచ్చని వివరించారు.

అప్రమత్తంగా ఉండాలి

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అప్రమత్తంగా ఉండి, మోడల్ కోడ్ ఉల్లంఘనలపై స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మోడల్ కోడ్ ఉల్లంఘన సమయంలో సీజ్ చేసేప్పుడు కచ్చితంగా పంచనామా చేయాలన్నారు. ఆ ప్రక్రియను వీడియోలో నిక్షిప్తం చేయాలని, సీవిజిల్ సహా ఇతర ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సూచించారు.

భద్రత కట్టుదిట్టం : ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టొద్దన్నారు. ఎన్నికల సమయంలో కార్యాలయాల ఏర్పాటుకు ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవోలు ఆనందకుమార్, మధుసూదన్, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, చేనేత జౌళిశాఖ అధికారి సాగర్, జిల్లా లేబర్ ఆఫీసర్ రఫీ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సొంత కారుకు ప్రభుత్వ సొమ్ము

- ట్యాక్సీ ప్లేట్ స్థానంలో వైట్ ప్లేట్
- తంగళ్లపల్లి తహసీల్దార్ నిర్వాకం



తంగళ్లపల్లి తహసీల్దార్ వాడుతున్న వైట్‌ప్లేట్ కారు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ సొమ్మును అడ్డదారుల్లో సొంత పనులకు వాడుకునేందుకు అధికారులు కొత్త పుంతలు తొక్కుతున్నారు. తంగళ్లపల్లి మండలానికి మూడు నెలల క్రితం కొత్తగా పోస్టింగ్ అయిన తహసీల్దార్ తన సొంత హ్యుందాయ్ కారు వైట్ ప్లేట్ నంబర్ టీఎస్ 22 హెచ్ 6408ను వాడుతున్నారు. ప్రభుత్వం తహసీల్దార్లకు ప్రయాణ భత్యం కింద ప్రతినెలా రూ.30 వేల వరకు చెల్లిస్తోంది. కానీ అందుకు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ సొంత వాహనాలను ఉపయోగించరాదని అదే సమయంలో కేవలం ట్యాక్సీ ప్లేట్ (ఎల్లో ప్లేట్) వాహనాలను మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రభుత్వం వాహనం కేటాయిస్తే దానికి సంబంధించిన ఖర్చులను భరిస్తుంది. ఎటువంటి నగదు చెల్లించదు. ప్రభుత్వ వాహనం అందుబాటులో లేకుంటే నిరుద్యోగులు డ్రైవింగ్ వృత్తి చేసుకుని ఉపాధి పొందేందుకు ఇలాంటి నిబంధనలు విధించారు. కాగా నిబంధనలను తుంగలో తొక్కుతూ సొంత వాహనాలు వాడుతూ.. రెంట్ వాహనాలను వాడుతున్నట్లు తప్పుడు లెక్కలు చూపుతూ ప్రతినెలా సొమ్మును తమ జేబులో వేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. తన సొంత వాహనమే ఉపయోగిస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

భారీ మెజార్టీ లక్ష్యంగా పనిచేయండి

- మంత్రి కేటీఆర్
- ప్రగతిభవన్‌లో స్థానిక నాయకులకు దిశానిర్దేశం



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: ఎన్నికల కోడ్ వచ్చిన మరుసటి రోజే జిల్లా నాయకులకు ప్రగతిభవన్‌కు రావాలని మంగళవారం పిలుపువచ్చింది. మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకులంతా ప్రగతిభవన్‌కు తరలివెళ్లారు. ఎన్నికల్లో భారీ మెజార్టీ లక్ష్యంగా పని చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి అందరూ సమష్టిగా గెలుపుకోసం కృషి చేయాలన్నారు. రెండుసార్లు నిండు మనస్సుతో దీవించిన ప్రజలు ఈ ఎన్నికల్లో కూడా భారీ మెజార్టీ ఇచ్చేలా చూడాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించాలన్నారు. ఎన్నికల్లో పాటించాల్సిన ప్రచారం, పథకాల తీరు, భవిష్యత్తులో చేసే అభివృద్ధి గురించి నాయకులకు వివరించారు. ప్రగతిభవన్ తరలివెళ్లిన వారిలో టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకర్, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక తదితరులున్నారు. ముస్తాబాద్ మండలం నుంచి ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో మేరా మాటి.. మేరా దేశ్



ఇంటింటా మట్టి సేకరణలో నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలో ‘మేరా మాటి.. మేరా దేశ్’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ హనుమాన్ ఆలయంలో కలశపూజలు నిర్వహించిన అనంతరం గాంధీనగర్, శివనగర్, సుందరయ్యనగర్, బీవై నగర్‌లో ఇంటింటా మట్టి సేకరణ చేపట్టారు. దేశ కోసం ప్రాణాలర్పించిన వీరులకు వందనాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఎనగంటి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం జిల్లా సరిహద్దు గంభీరావుపేట ఏరియాలో ఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 24 గంటలు తనిఖీలు ఉంటాయని, ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు. మద్యం, డబ్బు అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, సరైన ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ సొమ్మును తీసుకెళ్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. అత్యవసరాలైన వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లకు తీసుకెళ్లే డబ్బుల విషయంలో సరైన ధ్రువీకరణ పత్రాలు చూపెడితే మినహాయింపులు ఉంటాయన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలకు వెళ్లనున్నట్లు ఎస్పీ హెచ్చరించారు.

జిల్లాలో సరిహద్దు చెక్‌పోస్టులు

- తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి జిల్లెల్ల చెక్‌పోస్ట్
- గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దమ్మ చెక్‌పోస్ట్
- ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బద్దనకల్ చెక్‌పోస్ట్
- వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫాజుల్‌నగర్ చెక్‌పోస్ట్
- బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సింగాపూర్ చెక్‌పోస్ట్

క్లుప్తంగా

తల్లిదండ్రులపై కొడుకు దాడి



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

వేములవాడరూరల్: ఆస్తి కోసం తల్లిదండ్రుల పైనే దాడి చేశాడు ఓ కొడుకు. ఎస్‌ఐ మారుతి వివరాల ప్రకారం.. వేములవాడ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన రాచర్ల అంజయ్య–మల్లవ్వకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు ప్రకాష్ 20 ఏళ్లుగా ఖమ్మంలో ఉంటుండగా, చిన్న కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. గతేడాది అంజయ్య–మల్లవ్వ పేరు మీద ఉన్న ఎకరం భూమి అమ్మి అందులో కొంత నగదును ఇద్దరు కొడుకులకు పంచారు. అయినా ఇంకా తనకు డబ్బులు కావాలని మంగళవారం ఉదయం ఖమ్మం నుంచి వచ్చిన పెద్ద కొడుకు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే చుట్టుపక్కల వారు వారిని రక్షించగా ప్రాణాలతో బయటపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రకాష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేడిపల్లి సత్యం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి గ్రామ ఉపసర్పంచు పిట్టల మోహన్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అతడితో పాటు నాయకులు మ్యాన కరుణాకర్, కన్నం రాజు, అనంతుల ఆంజనేయులు, జలేందర్, నల్లగొండ శ్రీనివాస్ తదితరులు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు బోయిని ఎల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, నాయకులు ఏనుగుల కనుకయ్య, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, బోయిని ఎల్లేశ్, కట్ట లచ్చయ్య, గుడి శేఖర్‌రెడ్డి, నిమ్మ వినోద్‌రెడ్డి, బోయిని మల్లేశం, పర్శరాములు, పిట్టల లక్ష్మీరాజం, నక్క శ్రీకాంత్, లచ్చయ్య, శ్రీమాన్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

యువకుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం మోతె బైపాస్ రోడ్‌లో సోమవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మ్యాక ప్రణయ్(26) మృతిచెందాడు. మోతె గ్రామానికి చెందిన మధు బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి, ఢీకొట్టడం వల్లే చనిపోయాడని మృతుడి తల్లి పుష్పలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట: రైలు కిందపడి గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. మండల పరిధిలో బిజిగిరిషరీఫ్, పొత్కపెల్లి రైల్వేస్టేషన్ల మధ్య 45ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ముఖం గుర్తు పట్టడానికి వీలులేకుండా ఉందని, ఎలాంటి గుర్తింపుకార్డులు లభించలేదని తిరుపతి తెలిపారు. ఒంటిపై నలుపు కలర్ ప్యాంట్ ఉందని అన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వఆస్పత్రిలో భద్రపరిచారు. వివరాల తెలిసినవారు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి.తిరుపతి, సెల్‌నంబర్ 9949304574, 8712658604కు సంప్రదించాలని సూచించారు.

మద్యం పట్టివేత

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలో రెండు చోట్ల అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని సీజ్ చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రహీం తెలిపారు. స్థానిక మహాలక్ష్మి నగర్‌లోని గిన్నెర రవి ఇంట్లో సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టగా 48 లీటర్ల మద్యం దొరికిందన్నారు. అలాగే, హనుమాన్ వాడకు చెందిన బుర్ర శివ ఇంట్లో 7 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పచ్చనిచెట్లు నరికేస్తున్నారు..

- అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు
- హరితహారం ఎందుకని నిలదీత
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



చెట్లు నరికేసి రోడ్డుపై పడేసిన దృశ్యం

వేములవాడ: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కోట్లాది రుపాయల నిధులు వెచ్చించి హరితహారంలో మొక్కలు నాటించిన ప్రభుత్వం వాటి సంరక్షణలో విఫలమవుతోంది.. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పులో భాగంగా నరికేస్తున్నారు. కోట్లాది నిధులు వెచ్చించి నాటిన మొక్కలను నరికేస్తుండడంతో ప్రజాధనం వృథా అవుతోంది. హరితహారంలో అధికార యంత్రాంగమంతా పాల్గొని ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసి వాటి సంరక్షణకు కృషి చేయాలని అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సూచించారు. విద్యార్థులు కూడా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అవగాహన కల్పించారు. కానీ వేములవాడలో మాత్రం దీనికి భిన్నంగా అధికారులు ప్రవర్తిస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ చౌక్ నుంచి పాపన్నచౌక్ వరకు ఉన్న రోడ్డులోని చెట్లను రోడ్ల వెడల్పులో భాగంగా నరికేశారు. దీంతో రోడ్లన్నీ ఎబ్బెట్టుగా కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి కంటికిరెప్పలా కాపాడుకున్న చెట్లను నరికేస్తున్నారంటూ చెట్లను పెంచిన వ్యాపారులు, స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లు కష్టపడ్డాం



సెస్ ఆఫీస్‌రోడ్డులోని చెట్లను కాపాడుకునేందుకు రెండేళ్లుగా కష్టపడుతూనే ఉన్నాం. మా దుకాణాల ముందున్న చెట్లను నరికేశారు. హరితహారంలో భాగంగా కోట్లాది రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలను తాము ప్రాణంగా కాపాడితే రోడ్డు వెడల్పు పేరుతో కొట్టేశారు.
– హరీశ్–శిరీష దంపతులు, కర్రీ పాయింట్, వేములవాడ

చెట్లు నరికేయడం సరికాదు



రోడ్డుకు మంచి అందం, ప్రజలకు ఆరోగ్యం పంచే చెట్లను దారుణంగా నరికేశారు. ఎండ తీవ్రత నుంచి పాదాచారులు ఎలా కాపాడుకోవాలి. రోడ్ల వెడల్పు పేరుతో ఇలా చెట్లను కొట్టేయడం సరైంది కాదు.
– ఎం.తిరుపతి, వేములవాడ

పర్యావరణాన్ని కాపాడాలి



వేములవాడలో రోడ్లపై చెట్లు కనిపించడం లేదు. చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. వేములవాడలో చెట్లను నరికేయడంతో పర్యావరణం పాడవుతోంది. అధికారులు ఆలోచన చేయాలి.
– చేని లింగం, వేములవాడ

ఆయనతోనే ఆమె..

- కలిసి నడిచారు.. కలిసే 'పోయారు'
- భర్తతో కలిసి భార్య ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు
- నెల్లిపల్లి గ్రామంలో విషాదం నింపిన కౌలురైతు దంపతుల ఆత్మహత్య



రోదిస్తున్న మృతురాలి తల్లి మధునమ్మ



కన్నీటిపర్యంతమవుతున్న అశోక్ తల్లిదండ్రులు

మంథని: పుట్టినిల్లు.. మెట్టినిల్లు రెండూ నిరుపేద కుటుంబాలే.. కూలీపని చేసుకుంటేనే పూట గడిచేది.. వరద మిగిల్చిన విషాదం ఆ రెండు కుటుంబాలను చిదిమేసింది.. భర్తకు అన్నింటా చేదోడు వాదోడుగా, ఎంతోఅన్యోన్యంగా ఉండే భార్య.. భర్త వెంటే తాను తనువు చాలించింది.. కానీ, తన ఇద్దరు చిన్నారుల భవితవ్యం గురించి ఒక్కసారైనా ఆలోచన చేయలేదు.. విషాదం నింపిన ఈ ఘటన కన్నీరు తెప్పించింది. మంథని మండలం ఎక్లాస్పూర్ గ్రామపంచా యతీ పరిధి నెల్లిపల్లిలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించిన కటుకు అశోక్(35)అంటే ఆయన భార్య సంగీత(28)కు అమితమైన ప్రేమ అని స్థానికులు అనుకుంటున్నారు. భ ర్తను ఎవరైనా చిన్నమాట అంటే వారించేదని, తన కూతురు, కుమారున్ని సైతం ఎంతోఅల్లారుముద్దుగా పెంచుకుందని, అలాంటి దంపతులిద్దరూ తన ఇద్దరు చిన్నారులను వదిలి కానరాని లోకాలకు వెళ్లడంపై స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రెండుసార్లు పంట మునక

గ్రామానికి చెందిన కటుకు రాయమల్లు– రమాదేవికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. రాయమల్లుకు ఉన్న కొద్ది పాటి భూమిని తానే సాగు చేసుకుంటున్నాడు. ఓ కుమారుడు ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అశోక్ ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగు చేసుకుంటున్నాడు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో అశోక్ సాగు చేసిన వరి, పత్తి పంటలు రెండుసార్లు నీటమునిగి పంటలు దెబ్బతిని నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.2లక్షల వరకు అప్పు ఎలా తీర్చేదనే మనస్తాపంతో తన భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు, స్థానికులు భావిస్తున్నారు.

పిల్లల ముఖాలకు పసుపు ఎందుకు రాసినట్లు?

దంపతులిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వారి పిల్లలు సాయి, సన ముఖాలకు పసుపు ఉందని, అలా ఎవరు, ఎందుకు రాసి ఉంటారని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ పనిమానేసి.. వ్యవసాయం వైపు..

అశోక్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడని, రెండుమార్లు ప్రమాదం నుంచి బయటపడడంతో ఆ పనిమానేసి వ్యవసాయం వైపు దృష్టి సారించినట్లు స్థానికులు తెలిపారు. కాగా అశోక్‌కు వ్యవసాయం కూడా అచ్చిరాలేదని, గతంలో కూడా మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు పలువురు గ్రామస్తులు అనుకుంటున్నారు.



తంగళ్లపల్లి- సిద్దిపేట రహదారిపై సీఎం, మంత్రి ఫ్లెక్సీ



పద్మనగర్ గ్రామంలో బస్టాప్‌కు హోర్డింగ్



గూడెంలో వాల్‌పోస్టర్లు తొలగిస్తున్న సిబ్బంది

కోడ్ కూసినా నిద్రలేవలే..

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల కోడ్ కూసినా అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, రాజకీయ పార్టీల ప్రచార పోస్టర్లు ఎక్కడికక్కడ కనిపిస్తున్నా అటువైపు మాత్రం చూడడం లేదు. ప్రధాన రహదారులు, బస్‌స్టాప్‌లలో ఇప్పటికీ ప్రభుత్వ ప్రకటనలు, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు త్వరగా మేల్కొని తగు చర్యలు తీసుకుని ఎన్నికల కోడ్‌ను అమలు చేయాల్సిన అవసరం ఉంది.

కోడ్ కూసింది.. పోస్టర్ తొలగింది

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలో రాజకీయ పక్షాల పోస్టర్లు, బ్యానర్లు, వాల్‌పెయిటింగ్‌ను పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పార్టీల జెండాలు, పోస్టర్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశామని తహసీల్దార్ గణేశ్ తెలిపారు.

చెక్ పోస్టుల్లో విస్తృత తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుజాత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారు సిద్దిపేట జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. మూడు షిఫ్ట్‌ల వారీగా 24 గంటలపాటు వాహన తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేల పైచిలుకు నగదుతో ప్రయాణం చేసినట్లయితే తప్పనిసరిగా దానికి సంబంధించిన రశీదులు, ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే అనుమతిస్తారు. లేకుంటే అట్టి నగదును సీజ్ చేస్తారు.

ఫాజుల్‌నగర్ వద్ద..

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని జిల్లా సరిహద్దు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చే ఫాజుల్‌నగర్ ప్రాంతం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తహసీల్దార్ సుజాత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎలాంటి వాహనాలైనా తనిఖీలు చేసిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

శవమై తేలిన ధర్మతేజ

రామగుండం: ఎన్టీపీసీకి చెందిన పలువురు యువకులు ఈనెల 8వ తేదీన బర్త్ డే పార్టీ చేసుకునేందుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు వచ్చారు. కేక్ కట్ చేసి విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐదుగురు మిత్రులు గోదావరినదిలో స్నానానికి దిగారు. ఈక్రమంలో కనకమేడల ధర్మతేజ(32) నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. 48 గంటల పాటు గోదావరినదిలో జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభించింది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం



వైన్స్ షాపులోకి దూసుకెళ్లిన కారు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి తన కారులో మరో ముగ్గురితో కలిసి గోదావరిఖనికి వస్తున్నారు. ఈక్రమంలో ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఆ తర్వాత సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ స్తంభాన్ని ఢీకొంది. ఈ క్రమంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో కారు రివర్స్ గేర్‌లో రోడ్డు పక్కన ఉన్న ఓ వైన్‌షాపు వరండాలోకి వెళ్లి గోడను ఢీకొని నిలిచిపోయింది. గాయపడిన వారిని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిలించారు. ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వైన్‌షాపు వరండాలోని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బడుగు, బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్



మాట్లాడుతున్న రెడ్డిమల్ల భాను

సిరిసిల్లఅర్బన్: బడుగు, బలహీనవర్గాల పార్టీ కాంగ్రెస్ అని, రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి రానుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డిమల్ల భాను అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. సోమవారం బీఆర్‌ఎస్ యూత్ నాయకులు కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ ప్రకటించిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వక, పరీక్షలను లీకేజీలు చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. అధికారంలోకి రాగనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చిందం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిత్ నాయక్, అసెంబ్లీ కార్యదర్శి అక్కెన సతీశ్, పట్టణ కార్యదర్శి సతీశ్, జడల రాజు, శ్రీనివాస్, సంపత్ తదితరులు ఉన్నారు.

రైతాంగ సమస్యలపై పోరాటం



మల్లారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తానని కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ మల్లారెడ్డి అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన ఆయనను మంగళవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కొందరికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందని, గ్రామాల్లో విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆరోపించారు. ఎన్నికల తరుణంలో పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి పందిర్ల లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు సీసాతో ఒకరిపై దాడి



గాయపడిన శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాటమాట పెరిగి ఒకరిపై కల్లు సీసాతో దాడి చేసిన ఘటన మండలంలోని నారాయణపూర్‌లో మంగళవారం జరిగింది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. నారాయణపూర్‌కు చెందిన పాత భూపతి, లింగాల శ్రీనివాస్‌గౌడ్ స్నేహితులు. మహారాష్ట్రలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న శ్రీనివాస్, భూపతికి పని చూపిస్తానని వారం క్రితం అక్కడికి తీసుకెళ్లి మార్గ మధ్యలోనే వదిలేసి వెళ్లాడు. చేతిలో బస్సు చార్జీలు కూడా లేకపోవడంతో తెలిసిన వారి సాయంతో భూపతి ఇంటికొచ్చాడు. మంగళవారం గ్రామంలోని కల్లు దుకాణంలో గౌడ సంఘం సభ్యులు సమావేశమయ్యారు. అదే సమయంలో కల్లు దుకాణంలోకి వచ్చిన భూపతికి శ్రీనివాస్‌గౌడ్ కనిపించాడు. తనకు పనిచూపెట్టకుండా మధ్యలోనే వదిలేసిన విషయంపై శ్రీనివాస్‌గౌడ్‌ను నిలదీశాడు. ఈక్రమంలో మాటమాట పెరిగి కోపోద్రిక్తుడైన భూపతి అక్కడే ఉన్న కల్లు సీసాతో శ్రీనివాస్‌గౌడ్ తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితుడిని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించి భూపతిపై కేసు నమోదు చేశారు.

అధికారంలోకి రాగానే గ్యారెంటీ పథకాలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



ప్రచారం చేస్తున్న ఆది శ్రీనివాస్, నాయకులు

వేములవాడ: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని, ప్రజలంతా ఒక్కసారి అవకాశమిచ్చి ఆశీర్వదిస్తే అందుబాటులో ఉంటూ సేవలందిస్తా ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నా రు. పట్టణంలోని సుభాష్‌నగర్ పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దగా, మోసాలు తప్ప చేసిందేమీ లేదన్నారు. పుట్టబోయే పాపకు సైతం రూ.1.50 లక్షల అప్పు చేసి పెట్టారన్నారు. దళిత సీఎం లేదు, దళితులకు మూడెకరాల భూమి లేదు, దళిత బంధు కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అందుతుందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, రూరల్ అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పిట్టల తిరుపతి, నాయకులు రమేష్, స్వామియాదవ్, కూరగాయల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

కోనరావుపేట(వేములవాడ): అధికారంలోకి రాగానే హామీ ఇచ్చిన ఆరు పథకాలు కచ్చితంగా అమలు చేస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నిమ్మపల్లిలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తప్పనిసరిగా అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజలు కాంగ్రెస్ పట్ల సానుకూలంగా ఉన్నారని, ఈసారి ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ ఫిరోజ్‌పాషా, పెంతల శ్రీనివాస్, భూమేశ్, గంగాధర్, కొత్తకొండ మధు, గోపాల్, తాళ్లపెల్లి ప్రభాకర్, అనిల్, మహేందర్, బాబు, అంజయ్య, తిరుపతి, బక్కయ్య, బందెల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్ట పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ ఎస్‌ఎల్‌వీ క్వారీలో ఒడిశాకు చెందిన కార్మికుడు గోపీనాథ్ హన్సల్ (20) మృతిచెందాడు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని చింతల్యాడ గ్రామానికి చెందిన గోపీనాథ్ హన్సల్ ఉపాధి కోసం మల్లాపూర్‌లోని క్వారీకి వచ్చాడు. మంగళవారం పనుల్లో ఉండగా దాహం వేయడంతో నీళ్లు తాగేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, గుట్టపై నుంచి రాళ్లపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు క్వారీకి చెందిన వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువు శంభొనత్ శర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేట గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఐలేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో బెల్ట్ షాపుపై మంగళవారం దాడి చేయగా మద్యం లభ్యమైందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పలు గ్రామాల్లో బెల్ట్ షాపులు జోరుగా నిర్వహిస్తున్నారని, కొన్ని గ్రామాల్లోనే పోలీసులు దాడులు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గొధూర్ గ్రామంలో..

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గొధూర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. రూ.50 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఉమాసాగర్ మంగళవారం తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్గటూర్ పరిధిలో..

వెల్గటూర్(ధర్మపురి): ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో వెల్గటూర్ మండలంలో బెల్ట్ షాపులపై సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రాజారాంపల్లిలో 2, కప్పారావుపేటలో 2, అంబారిపేటలో 3, వెల్గటూర్‌లో 1, శాఖాపూర్‌లో 1 చొప్పున మొత్తం 9 బెల్ట్ షాపుల్లో రూ.1.04 లక్షల విలువైన 220 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.